క్లుప్తంగా

నేడు ఆర్‌ఎంపీలకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామోజీ వీరాచారి, రాళ్లబండి శంకర్‌లు పేర్కొన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం మంగళవారం 2.30 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు కాబట్టి రమేశ్ యాదవ్, భోజారెడ్డి, గజానంద్, విశ్వనాథ్, మోహన్, అశోక్, బిక్కు రమణ యాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అగ్రజా టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, జలెందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. వృక్షాలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

ఉట్నూర్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయలను భావితరాలకు అందించాలని కవన కోకిల బంకట్‌లాల్ అన్నారు. తీజ్ పండుగ పురస్కరించుకొని వీడియో పాట చిత్రీకరించారు. ఈసందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. బంజారా సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోకుండా భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో పాట చిత్రీకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రేంసింగ్, సేవదాస్, శివ, మారుతి, వెంకటేశ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

భీంరావు వర్ధంతికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఈనెల 29న నిర్వహించే దివంగత మొట్టమొదటి గిరిజనశాఖ మంత్రి కోట్నాక భీంరావు వర్ధంతి కార్యక్రమానికి రావాలని రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఆహ్వాన పత్రం అందజేశారు. అదే విధంగా సంఘ సభ్యులు ఐటీడీఏ పీవోకు సివిల్ సూటులను విచారించే అధికారం లేదని హైకోర్టు తీర్పు వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈవిషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని, మళ్లీ ఐటీడీఏ పీవోకు సివిల్ సూటులను విచారణ చేసే అధికారులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెడ్మ కొద్దు, నిరంజన్, ఆశారెడ్డి, ప్రకాశ్, బాలాజీ పాల్గొన్నారు.

మిట్టు రవికి కళారత్న పురస్కారం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన నృత్య కళాకారుడు మిట్టు రవి కళారత్న పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో భాషా సాంస్కృతిక శాఖ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన వేడుకల్లో ఈ పురస్కారం ప్రదానం చేశారు.

కృష్ణస్వామి జయంతి



నివాళులర్పిస్తున్న కౌఠ(బి) గ్రామస్తులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో బహుజన సామాజిక సంస్కర్త, హైదరాబాద్ తొలి మేయర్ కోర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ 131వ జయంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు సున్నపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బహుజన సంఘ సంస్కర్త కృష్ణస్వామి విగ్రహాన్ని ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కొటాబి, జెట్టి రాజేశ్వర్, సాయన్న, నరేశ్, సంతోష్, శ్రీనివాస్, గణేష్, సురేందర్, నర్సయ్య, రవి, బాపురెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి



బోథ్: సొనాలలో నృత్యం చేస్తున్న గోపికలు



నేరడిగొండ: శ్రీకృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



ఆదిలాబాద్: ఉట్టి కొడుతున్న చిన్నారి

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణ వేసి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో శోభాయాత్రలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రంలో..



నేరడిగొండ: చిన్నారుల నృత్యం



కృష్ణుడి ప్రతిమను ఉయ్యాల ఊపుతున్న భక్తులు



తాంసి: ఉట్టి కొడుతున్న గ్రామస్తులు



ఇచ్చోడ: గోపికల వేషధారణలో చిన్నారులు



ఉట్నూర్‌రూరల్: కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గుంతలమయంగా తాంసి(కె)రోడ్డు

- గుంతలమయంగా తాంసి(కె) రోడ్డు
- పట్టించుకోని అధికారులు

తాంసి: ఏళ్ల క్రితం వేసిన బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. దిక్కులేని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. భీంపూర్ మండలంలోని తాంసి(కె), గొల్లఘాట్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పిప్పల్‌కోటి ఎక్స్ రోడ్డు నుంచి తాంసి(కె) వరకు పలుచోట్ల గుంతలుగా, కంకర లేచి అధ్వానంగా మారింది. దెబ్బతిన్న తాంసి(కె) ప్రధాన రోడ్డుపై నిత్యం వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినా.. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడం లేదు.

ఆరు కిలోమీటర్ల మేర గుంతలు..

పిప్పల్‌కోటి నుంచి తాంసి(కె) వరకు ఆరు కిలో మీటర్ల మేర రోడ్డు ఉంది. ఆరు కిలోమీటర్ల మేర పలుచోట్ల రోడ్డు దెబ్బతినగా.. పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి తాంసి(కె) వరకు చేరుకోవాలంటే అరగంటకు పైగా సమయం పడుతోంది. పేరుకే బీటీ రోడ్డుగా చెప్పుకుంటున్నా.. మట్టిరోడ్డు కంటే అధ్వానంగా ఉంది. గుంతలుగా మారి కంకర తేలి అధ్వానంగా మారడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతూ.. ప్రయాణం సాగిస్తున్నారు. గతేడాది గుంతలను అదుపు తప్పించే క్రమంలో ఇసుక ట్రాక్టర్ రోడ్డు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. గుంతల రోడ్డుపై వాహనాలను నడపడం ద్వారా నడుము నొప్పి, వెన్నుపూస దెబ్బతింటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు పెన్‌గంగ నది నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా పగలు రాత్రి అనే తేడా లేకుండా తరలించడం ద్వారా రోడ్డు మరింత దెబ్బతింటుంది.

వర్షం కురిస్తే..

చిన్నపాటి వర్షం కురిసినా.. గుంతల్లో నీరు నిలిచి నీటి కుంటాలను తలపిస్తున్నాయి.

రోడ్డుపై నీరు నిలవడంతో గుంతలు ఎంత మేరకు ఉన్నాయో తెలియని పరిస్థితి. తాంసి(కె) నుంచి విద్యార్థులు పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తారు. రోడ్డు బాగా లేక ఆటోలో రావడానికి అవస్థలు పడుతున్నారు. రోడ్డు బాగా లేక గత రెండేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీస్‌ను రద్దు చేశారు. విద్యార్థులు, గ్రామస్తులు ప్రైవేట్ వాహనాల్లో తాంసి(కె), గొల్లఘాట్, పిప్పల్‌కోటి గ్రామాలకు ప్రయాణం చేయాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పిప్పల్‌కోటి గ్రామం నుంచి తాంసి(కె)వరకు బీటీరోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గతంలో వేసిన రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో పూర్తిగా వర్షపు నీరు నిలిచింది. రాత్రిపూట గ్రామానికి వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నాం.

– ఉమేష్ వైద్య, తాంసి(కె)

బంద్ విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఏజెన్సీ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోటల్ యజమానులు, వ్యాపారస్తులు, దుకాణదారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తుడందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు కాత్లే శేఖర్, సార్‌మేడి మెస్రం శంభు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఇచ్చోడ: గ్రామీణా స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లురి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బూత్‌స్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కేంద్రే నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, బాబారావు, కృష్ణకుమార్, జాదవ్‌రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లురి చంద్రశేఖర్

'బెదిరింపులకు భయపడేది లేదు'

ఆదిలాబాద్‌టౌన్: బెదిరింపులకు భయపడేది లేదని, రైతుల పక్షాన ఉద్యమిస్తామని రైతు సమన్వయ అధ్యక్షుడు లింగారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు జోగు రామన్నపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. జోగు రామన్న చేసిన అభివృద్ధిని పొగుడుతూ మాట్లాడిన కొంత మంది నాయకులు లాభాపేక్ష కోసం కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. ఇప్పటివరకు 30 శాతం రుణమాఫీ జరిగిందన్నారు. రైతు భరోసా అందించకుండా నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. రైతుకు అండగా నిలవాల్సిన నాయకులు బీఆర్‌ఎస్ నాయకులను విమర్శించడం సరికాదన్నారు. జైనథ్ మండలంలోని పీఏసీఎస్ బ్యాంక్‌లో 1700 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వీటిపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్‌ఎస్ నాయకులు నారాయణ, కుమ్ర రాజు, మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేశ్, బట్టు సతీష్, దయానంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగారెడ్డి

వసతి గృహం పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహన్ని సోమవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దోమలు వృద్ధి చెందకుడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంటగది, స్టోర్ రూం, మెనూ వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం సరిగా లేదని, పాత బియ్యం బాగుందని విద్యార్థులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆలయ వార్షికోత్సవం

బోథ్: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం 17వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఉత్సవమూర్తి విగ్రహాన్ని మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించా రు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి

ఎదులాపురం: ఎస్సీ వర్గీకరణకు అన్నివర్గాలు సహకరించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా మాదిగలు పూర్తిగా వెనుకబడిపోయి ఉన్నారని, ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్లుగా ఉద్యమిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాల కులస్తులు సహకరించాలని కోరారు. వర్గీకరణను వ్యతిరేకిస్తే జరిగే పరిణామాలకు, వ్యతిరేకించే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సన్మానం

బజార్‌హత్నూర్: మండలంలోని చందునాయక్‌తండా, భూతాయి(కె), భూతాయి(బి) గ్రామాల పరిధి ఏఈవో రాజేశ్వర్ బదిలీపై వెళ్లడంతో సోమవారం భూతాయి గ్రామస్తులు రాజేశ్వర్‌ను శాలువాతో సత్కరించారు. ఆయన రైతులకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. గ్రామపటేల్ తొడసం వినాయక్‌రావ్, మాజీ సర్పంచ్ మారుతి, చంపత్‌రావ్, శంకర్, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టిసారించాలి

ఆదిలాబాద్: పట్టణంలోని కేఆర్కే కాలనీలో వర్షాకాలంలోనూ నీటి తిప్పలు తప్పడం లేదు. సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. స్పందించిన స్థానిక బీజేపీ నాయకురాలు స్వప్న సోమవారం మున్సిపల్ అధికారులతో సంప్రదించడంతో వారు వాటర్ ట్యాంకర్ పంపించారు. ఈసందర్భంగా స్వప్న మాట్లాడుతూ కేఆర్కే కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని దనోర(బి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ డిగంబర్ పాటిల్ ఇద్దరు సోదరులు అర్జునే సుభాష్, అర్జునే ప్రహ్లాద్‌లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, నాయకులు ఉన్నారు.

జైనథ్: మండలంలోని బాలాపూర్‌కు చెందిన పుప్పాల భూమన్న ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న సోమవారం గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ జక్కుల వినోద్, పరమేశ్వర్ అయ్యా, గోవిందరావు, నారాయణ, దీపక్ పాల్గొన్నారు.

సిరిచెల్మ ఆలయంలో భక్తుల రద్దీ

ఇచ్చోడ: అతిపురాతన సిరిచెల్మ మల్లికార్జున ఆలయం శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు మల్లికార్జునుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలం నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. ప్రసుతం దోమలు వ్యాప్తి అధికంగా ఉన్నందున మలేరియా, డెంగ్యు వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, సుభాష్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నుమియతండాలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టెంబి నుంచి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మూడు కిలోమీటర్లు బురదలో కాలినడకన వెళ్లి 54 మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరంతో బాధపడుతున్న 12 మందికి రక్త పరీక్షలు చేసి నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సూర్యప్రకాష్, దివ్యవాణి రమేశ్, ఏఎన్‌ఎం విజయ, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు

నేరడిగొండ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. 2023–24 సంవత్సరంలో చేపట్టిన పనులను డీఆర్పీ కవితతో పాటు తనిఖీ బృందం ఇంటింటికీ వెళ్లి ఉపాధిహామీ కూలీల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని బుగ్గారం గ్రామంలో పర్యటించారు. ప్రస్తుతం మండలంలోని 16 గ్రామాల్లో 16 బృందాలు తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏ సమస్య ఉన్నా.. బృందం సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ప్రజావేదికలో సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్పీ కవిత

వారసంతలో 'పొలాల' సందడి



అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వారసంతలో పొలాల పండుగ సందడి నెలకొంది. పొలాల అమావాస్య సమీపిస్తుండడంతో వ్యాపార దుకాణాల్లో ఎడ్లకు సంబంధించిన రంగులు, అలంకరణ సామగ్రిని రైతులు కొనుగోలు చేశారు. దీంతో వారసంతలో సందడి వాతావరణం నెలకొంది.

పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: సెప్టెంబర్ 1న నిర్వహించే పొలాల పండుగ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉట్నూర్ ఐబీ నుంచి నేతకాని మహార్ కులస్తుల సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేలా గంగన్నపేట వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగేశ్, బొర్లకుంట దుర్గయ్య, కేవళ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.